క్లుప్తంగా

లయన్స్ క్లబ్‌లో ఉచిత నేత్ర శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గంగవరం: మండలంలోని లయన్స్ క్లబ్‌లో ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని పలమనేరు పట్టణంలోని పుగలెంధి తండ్రి ఓబులుచెట్టి జ్ఞాపకార్థంగా ఆదివారం నిర్వహించారు. కుప్పం పీఈఎస్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 75 మంది కంటి పరీక్షలు చేశారు. 13మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసినట్టు క్లబ్ ప్రెసిడెంట్ రఘు తెలిపారు.

కంటి ఆపరేషన్లకు 67 మంది ఎంపిక



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సదుం: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆదివారం రోటరీ క్లబ్(తిరుపతి), అరవింద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 320 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 67 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు నిర్వాహకులు చెప్పారు. అలాగే 130 మంది మహిళలకు వివిధ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధులు చలపతి, రామ్మోహన్‌రెడ్డి, రాజ్‌కుమార్, లక్ష్మీపతి, డాక్టర్లు బిస్వజిత్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాత, ఈఓ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయానికి వచ్చే యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆదివారం వాట ప్రారంభోత్సవం చేశారు. తిరుపతికి చెందిన సుబ్బారాయుడు, రాజంపేట వెంకటసుబ్బయ్య సహకారంతో వాటర్ ప్లాంట్‌ను రూ.2లక్షలతో ఏర్పాటు చేసినట్లు ఈఓ చంద్రమౌళి తెలిపారు. నడకదారి నుంచి ఆలయానికి వచ్చే భక్తులకు ఈ ప్లాంట్‌ను వినియోగించనున్నట్లు చెప్పారు. దాతలను ఆలయ అధికారులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

మానసికోల్లాసానికి క్రీడలు



క్రీడలలో గెలుపొందిన జట్లకు బహుమతులు ఇస్తున్న ఎస్‌ఐ లక్ష్మీకాంత్

గుడుపల్లె: యువతకు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని గుడుపల్లె ఎస్‌ఐ లక్ష్మీకాంత్ అన్నారు. ఆదివారం మండలంలోని సంగనపల్లెలో నిర్వహించిన బసప్ప క్రికెట్ టోర్నీలో సంగనపల్లె టీం విన్నర్‌గా గెలుపొందడంతో మొదటి బహుమతిగా రూ12 వేలు, రన్నర్స్ స్థానంలో నిలిచిన చిన్నపర్తికుంట జట్టుకు రెండవ బహుమతిగా రూ.6 వేల తోపాటు జ్ఞాపికలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, సర్పంచ్ అమరనాథ్, ఎంపీటీసీ వెంకటమ్మ, యూత్ రవి, సంపంగి, గోపాల్, కుమార్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో చిన్నారులకు క్విజ్ పోటీలు



చర్చిలో పాటలు పాడుతున్న చిన్నారులు

పుంగనూరు: పట్టణంలోని సీఎస్‌ఐ హట్టన్ మెమోరియల్ చర్చిలో ఆదివారం ఫాస్టర్ రాఖేష్ నిమ్రోద్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రార్థనా కార్యక్రమం అనంతరం చిన్నారులకు క్విజ్ పోటీలను నిర్వహించి, బహుమతులు పంపిణీ చేశారు. చిన్నారులు చిన్నతనం నుంచే దైవభక్తి కలిగి, సన్మార్గంలో నడవాలని ఆయన వారికి సందేశమిచ్చారు.

ప్రతి కుటుంబానికీ మేలు

- ఎమ్మెల్యే వెంకటేగౌడ



దేవదొడ్డిలో లబ్ధిదారులకు బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె : ప్రతి కుటుంబానికీ మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ అన్నారు. మండలంలోని దేవదొడ్డిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. 462 కుటుంబాలను పలకరించి, ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని సంక్షేమ బుక్ లెట్లతో వివరించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

మురుగు కాలువలు శుభ్రం చేయాలని, వీధిదీపాలు వెలగడం లేదని దేవదొడ్డి గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కామినేపల్లెలో విద్యుత్ స్తంభం మార్చాలని కొంత కాలంగా కోరుతున్నా ఫలితం లేదని విన్నవించారు. అప్పటికప్పుడే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో స్తంభాన్ని మార్పించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలను రాజకీయాలకు అతీతంగా తమ ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తోందన్నారు. దేశంలోనే వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలతో ప్రజలకు సేవలందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. వలంటీర్ల సేవలకు మూడేళ్లుగా పురస్కారాలు, నగదు పారితోషికాలను ముఖ్యమంత్రి ఇస్తున్నారని, మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే అభివృద్ధి, సంక్షేమం మరింత వేగం పుంజుకుంటామన్నారు. రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి పోస్టర్లు విడుదల

శ్రీఆచార్య ప్రబోధానందయోగీశ్వరుల సహకారంతో పలమనేరులో ఆగస్టు 6న నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల పోస్టర్లను ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ ఆవిష్కరించారు. వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలను రాజకీయాలకు అతీతంగా తమ ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తోందన్నారు. దేశంలోనే వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలతో ప్రజలకు సేవలందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. వలంటీర్ల సేవలకు మూడేళ్లుగా పురస్కారాలు, నగదు పారితోషికాలను ముఖ్యమంత్రి ఇస్తున్నారని, మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే అభివృద్ధి, సంక్షేమం మరింత వేగం పుంజుకుంటామన్నారు. రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాజంపేట వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూప, సర్పంచులు బాలక్రిష్ణగౌడు, వెంకటేష్, రాజప్ప, ఎంపీటీసీలు వినాయకం, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కార్తిక్, వైఎస్సార్ సీపీ నేతలు తబ్రాజ్, లక్ష్మీనారాయణ, రామ్‌రాజ్, వెంకటేష్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఇసుక కామెర్లు!

- ఇసుక పాలసీ ఫ్రీ అంటూ టీడీపీ పాలనలో దోపిడీ
- ఇతరులపై నెపం నెట్టడంతో సిద్ధహస్తుడు
- టీడీపీ అధినేత తీరుపై ఎమ్మెల్యే వెంకటేగౌడ మండిపాటు

పలమనేరు: చేసిందంతా చేసి ఇతరులపై నెపాన్ని నెట్టడంతో చంద్రబాబుకు మించిన సిద్ధహస్తుడు లోకంలో లేడని, దొంగే దొంగ అన్నట్టు ఆయన మాటలు ఉన్నాయని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి ఘాటుగా విమర్శించారు. ఆదివారం నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె మండలం కూటాలవంకలో వారు నాయకులతో కలసి మీడియాతో మాట్లాడారు. గత టీడీపీ హయాంలో కౌండిన్యనది నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇష్టానుసారంగా ఇసుకను తరలించారన్నారు. అప్పుడు లేవనినోరు ఇప్పుడు చంద్రబాబుకు లేస్తోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు ఎలాంటి అక్రమాలు చేసినా బాబు పట్టించుకోలేదని, ఇప్పుడు వైఎస్సార్ సీపీ పాలనపై విషం చిమ్మడమే లక్ష్యంగా చంద్రబాబు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు చంద్రబాబు తీరు ఉంటోందని, ఆయన ఎన్ని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్లు ఇచ్చినా ప్రజలెవరూ విశ్వ సించరని స్పష్టం చేశారు. ఇసుక పాలసీని ఫ్రీ అంటూ అధికారంలో ఉన్నప్పుడు జనం నుంచి ఎన్ని కోట్లు కొట్టేశారో లోకేష్ గురించి తెలియనిదెవరికి ప్రశ్నించారు. తమ ప్రభుత్వ పాలనలో అన్ని విధానాలు పారదర్శకంగా సాగుతుంటే ఏం చేయాలో దిక్కుతోచక చంద్రబాబు ఏదో ఒక అంశంపై రా ద్ధాంతం చేసి, ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, మైలేజీ పొందాలని యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. కా ర్యక్రమంలో బైరెడ్డిపల్లె ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ కేశవులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దయానంద్‌గౌడ, భాలయ్య తదితరులు పాల్గొన్నారు.

29న సామాజిక తనిఖీ బహిరంగ సభ

పులిచెర్ల(కల్లూరు): సామాజిక తనిఖీ బహిరంగ సభ 29 మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాజశేఖర్ తెలిపారు. ఉపాధి హామీ పథకంలో మండలంలోని 25 పంచాయతీలలో ఏప్రిల్ వరకు జరిగిన పనులను 16 నుంచి 25వరకు సామాజిక తనిఖీ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందుకు సంబంధించిన నివేదికలను బహిరంగ సభలో నివేదిస్తారన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో మదర్‌థెరిసా విద్యార్థినుల విజయకేతనం



ముస్కాన్



జ్యోతిక



నిఖిత



నజియ

గంగవరం: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన 6వ సెమిస్టర్ ఫలితాల్లో మండలంలోని మదర్‌థెరిసా డిగ్రీ కళాశాల విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరచినట్టు కరస్పాండెంట్ రవీంద్రబాబు ఆదివారం తెలిపారు. బీకాం(సీఏ)లో ముస్కాన్(9.31), జ్యోతిక(8.97), నజియ(8.94), నిఖిత(8.94), దీప్తి(8.91), నాగమౌనిక(8.89), కావ్యశ్రీ(8.80) జీఎస్‌జీపీఏ సాధించారన్నారు. బీకాం(సీఏ)లో 101 డిస్టింక్షన్లు సాధించడంతోపాటు 99 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. విద్యార్థినీ విద్యార్థులను కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ మధుసూధన్‌రావు అభినందించారు.

అలరించిన ‘దుర్యోధన వధ’



తవణంపల్లె: ముట్టుకూరులోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం దుర్యోధన వధ ఘట్టం అలరించింది. ధర్మరాజుల గుడిలో ఈనెల 11నుంచి మహాభారత యజ్ఞం కార్యక్రమం జరుగుతోంది. ఆదివారం దుర్యోధన వధ సందర్భంగా నేలపై పొడవునా మట్టితో భారీగా దుర్యోధనుడి విగ్రహం ఏర్పాటు చేశారు. ఉభయదారులతో ద్రౌపదీదేవి, ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం దుర్యోధనుడు, భీముడు వేషధారణ కళాకారులు వధ ఘట్టాన్ని తమ ప్రదర్శనతో రక్తి కట్టించారు. మడుగులో దాగి ఉన్న దుర్యోధనుడిని బయటకు తీసుకొచ్చి వధించే ఘట్టం ప్రదర్శన ఆకట్టుకుంది. దుర్యోధనుడి మట్టి విగ్రహం మట్టికోసం భక్తులు పోటీపడి తీసుకెళ్లారు. సోమవారం ధర్మరాజు పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు బాబురెడ్డి తెలిపారు.

గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.1.5 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి గోసంరక్షణ ట్రస్ట్‌కు బెంగళూరుకు చెందిన జయప్రకాష్ కుటుంబ సభ్యులు ఆదివారం రూ.1.5 లక్షల విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

గుట్టుగా గంజాయి అమ్మకాలు

- పెడదారి పడుతున్న యువత
- దృష్టి సారించని పోలీసులు

రామకుప్పం: రామకుప్పం గంజాయి విక్రయాలకు నెలవుగా మారింది. కొందరు నిత్యం గంజాయిని తీసుకునివచ్చి పట్టణ శివారు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. చీకటి పడితే యువకులు గంజాయి విక్రయ ప్రాంతాలకు వెళ్తున్నారు. గంజాయి మత్తులో జోగుతున్న యువత పెడదారి పడుతోంది. వ్యసనానికి బానిసలైన యువకులు జులాయిలుగా తిరుగుతున్నారు; ఘర్షణలకు దిగుతున్నారు. స్థానికులు గంజాయి విక్రయాల విషయమై కొంతకాలంగా పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. గంజాయి విక్రయదారులు రాత్రివేళల్లో విద్యార్థులకు గంజాయి సరఫరా చేస్తున్నట్టు సమాచారం. సంబంధిత శాఖ ఉన్నతాధికారులైనా స్పందించి, గంజాయి విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని రామకుప్పం వాసులు కోరుతున్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



ఆలయంలో హోమపూజలు చేస్తున్న రుత్వికులు

సదుం: మండలంలోని జాండ్రపేటలో నూతనంగా నిర్మించిన పార్వతీ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆదివారం యాగశాల ప్రవేశం, జప పారాయణం, కుంభారాధన, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు, పుష్పాది వాసం, మూల విగ్రహ ప్రతిష్ఠ, సహస్ర నామార్చన, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. సోమవారం కలశార్చన, మహా రుద్రాభిషేకం, మహా కుంభాభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎల్‌ఐసీ సురేంద్రరెడ్డి దంపతులు చెప్పారు.

గృహసారథులు, కన్వీనర్లకు సమావేశం రేపు

సదుం: మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించనుండడంతో అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. అందరూ హాజరు కావాలని కోరారు.

బాలరాజు సేవలు చిరస్మరణీయం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న నేత్ర వైద్యుడు నారాయణమూర్తి

శాంతిపురం: చిత్తూరు వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, మృతి చెందిన రచయిత బూదుగూరు బాలరాజు సేవలు చిరస్మరణీయమని వక్తలు స్మరించారు. బాలరాజు స్వగ్రామమైన రాళ్లబూదుగూరులో ఆదివారం సంస్మరణ సభ, ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సినీ రచయిత త్యాగరాజు మాట్లాడుతూ, నాటికలు, కవిత్వం, గేయ రచన, నటనలో బాలరాజు సిద్ధహస్తుడని అన్నారు. కళామతల్లి ఓ ముద్దు బిడ్డను కోల్పోవడంతో పాటు సమాజం ఓ స్వచ్ఛంద సేవకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బెంగళూరుకు చెందిన శారద కంటి ఆస్పత్రి వైద్యులు 130 మంది రోగులను పరీక్షించి వారిలో 36 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. రచయిత బాలరాజు కుటుంబ సభ్యులు సహకారంతో బెంగళూరులో ఉచితంగా శస్త్రచికిత్స చేయిస్తామని సాయిమాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు తెలిపారు.

ఇంటి పన్ను కడితేనే ‘చేయూత’!

అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలను ఎలాంటి కండీషన్లు లేకుండా ప్రభుత్వం ప్రజలకు అందిస్తుంటే... కొంతమంది ఉద్యోగుల పనితీరు వల్ల పథకాలు అందని పరిస్థితి ఉత్పన్నమవుతోంది. మండలంలోని సంగనపల్లె పంచాయతీ కార్యదర్శి తీరు ఇదే కోవలో ఉంటోంది. ఇంటి పన్ను కడితేనే ‘చేయూత’ అని కార్యదర్శి మెలిక పెడుతుండడంతో ప్రజలు మండిపడుతున్నారు.

- ఓ పంచాయతీ కార్యదర్శి నిర్వాకం
- లబోదిబోమంటున్న జనం

గుడుపల్లె: మండలంలోని సంగనపల్లో గ్రామ పంచాయతీలో కార్యదర్శి సద్గుణ ప్రజలకు సంక్షేమ పథకాల చేరవేయడంలో అనుసరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం 45 సంవత్సరాలు పైబడిన మహిళలకు చేయూత పథకం అమలు చేస్తోంది. అయితే ఈ పథకం ప్రయోజనాలు పొందాలంటే దరఖాస్తుదారులు విధిగా ఇంటి పన్ను కట్టాలని, పన్ను బకాయిలను పూర్తిగా చెల్లిస్తేనే చేయూత పథకం అందుతుందని, లేదంటే లేదని పంచాయతీ కార్యదర్శి నిక్కచ్చిగా చెప్పడంతో కొందరు అప్పులు చేసి పన్నులు చెల్లించారు. మరికొందరు డబ్బు లేకపోవడంతో చేయూతకు దూరమవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యదర్శి పనితీరు మూలాన లబ్ధిదారులు ప్రభుత్వాన్ని నిందించాల్సి వస్తోంది.

కార్యదర్శి అలా చేయకుండా చర్యలు తీసుకుంటా

సాధారణంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో మాత్రమే ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో కట్టలేని వారికి నోటీసులు జారీ చేసి వసూలు చేయాల్సి ఉంది. ఎలాంటి నోటీసులు లేకుండా, సంక్షేమ పథకాల కోసం వచ్చిన వారికి ఇలా కొర్రీలు పెడుతుండడంతో ప్రజలకు దిక్కుతోచడం లేదు. దీనిపై ఎంపీడీఓ శంకర్‌ను వివరణ కోరగా, చేయూత పథకం దరఖాస్తు కోసం పంచాయతీ కార్యదర్శి సద్గుణ ఇంటి పన్ను వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, సంక్షేమ పథకాలకు ఇంటి పన్నుతో ముడిపెట్టరాదని ఇప్పటికే ఆదేశించినట్లు చెప్పారు. ఇకపై అలా చేయకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పారిశుధ్యం మెరుగుతో క్లీన్ పుంగనూరు



కాలువల్లో పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వెంకటసుబ్బయ్య

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించి, క్లీన్ పుంగనూరుగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్యతో కలసి 7వ వార్డులోని మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేయించారు. చైర్మన్ మాట్లాడుతూ, పట్టణంలోని ప్రధాన కాలువలతో పాటు చిన్నచిన్న కాలువల్లో కూడ పూడికతీత పనులతో నీరు నిల్వ లేకుండా చేస్తామన్నారు. పట్టణంలోని మురుగునీటి కాలువలన్నింటినీ కౌండిన్యనది కాలువల్లోకి అనుసంధానం చేసే కార్యక్రమానికి పూనుకున్నామని, ప్రస్తుతం కౌండిన్య నది కాలువల్లో సిమెంటు కాలువలు నిర్మించేందుకు మంత్రి పెద్దిరెడ్డి రూ.22 కోట్లు విడుదల చేశారని తెలిపారు. దీని ద్వారా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లోని మురుగునీరు కౌండిన్య నదిలో నిల్వ లేకుండా సుబ్బమ్మ చెరువు మొరవ నీటిలోనికి తరలిస్తామన్నారు. దీని వలన దోమల బెడద తగ్గి, పారిశుధ్యం మెరుగు పడుతుందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమ పోటీలలో పుంగనూరుకు అగ్రస్థానం లభించేలా ప్రజలు తమ అభిప్రాయాలను కేంద్ర బృందాలకు తెలపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌పై ఫిర్యాదు

పెద్దపంజాణి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, లోకేష్, అచ్చెన్నాయుడుపై ఆదివా రం పెద్దపంజాణి పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తూ, ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరిపై ఎక్కువ కేసులుంటాయో వారికి నామినేటెడ్ పదవు లు ఇస్తామని యువగళం పాదయాత్రలో లోకేష్ ప్రకటించడం శోచనీయమన్నారు. తక్షణం వీరి పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో-కన్వీనర్ మనోహర్‌రెడ్డి, పెద్దపంజాణి మండల కన్వీనర్ బాలాజి, కో-కన్వీనర్లు నరేష్, భరత్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలపై గజరాజుల విధ్వంసం



ఏనుగులు తొక్కేసిన వరి పంట

పెద్దపంజాణి: మండలంలో శనివారం రాత్రి పేటూరు ఫారెస్టు బీటు నుంచి వచ్చిన ఏనుగులు పెనుగొలకల గ్రామ పంట పొలాలపై విరుచుకుపడ్డాయి. మహిళా రైతు చిట్టెమ్మ వరి పంటను తొక్కి నాశనం చేశాయి. రవికుమార్‌కు చెందిన రాగి పంటను, గంగయ్యకు చెందిన అరటి మొక్కలను ధ్వంసం చేశాయి. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు ధ్వంసమై ఉండడం చూసి లబోదిబోమన్నారు. రైతులు మాట్లాడుతూ పంట పొలాలపై గజ రాజుల విధ్వంసం కొనసాగుతూనే ఉందన్నారు. పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాలైన ఆకులవారిపల్లె, గౌరీనగర్, జిట్టంవారిపల్లె, ముదిరెడ్డిపల్లె, పెద్దకాప్పల్లె, పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లె పంట పొలాలపై రోజూ ఏదో ఒక చోట ఏనుగులు దాడులు చేస్తూ పంటలకు తీవ్రంగా నష్టం కలిగిస్తున్నాయని తెలిపారు. ఏనుగులు అటవీ ప్రాంతం నుంచి పొలాల్లోకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న టెంపో : డ్రైవర్ మృతి



మృతి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మంజునాథరెడ్డి

గంగవరం: గంగవరం మండలం నాలుగురోడ్ల వద్ద శనివారం అర్ధరాత్రి ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి టెంపో ఢీకొన్న ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మండలంలోని గోవిందశెట్టిపల్లెకు చెందిన డ్రైవర్ మంజునాథరెడ్డి ట్రాక్టర్‌లో నీలగిరి చెట్ల కర్రలు లోడ్ చేసుకుని కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్‌కు బయలుదేరాడు. నాలుగురోడ్లు వద్ద సర్వీస్ రోడ్డు దాటి జాతీయ రహదారిలోకి చేరుకునే సమయంలో ట్రాక్టర్‌ను రేణిగుంట నుంచి బెంగుళూరుకు అరటిలోడ్‌తో వెళ్తున్న టెంపో వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మంజునాథరెడ్డి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టెంపో డ్రైవర్ మోహన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

నీతి పద్యాలతో సన్మార్గానికి బాట



జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు పొందిన చిన్నారులతో నిర్వాహకులు

పలమనేరు: నీతి పద్యాలు సన్మార్గానికి, భవిష్యత్తుకు బాట చూపే నేస్తాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కళామందిరంలో రాష్ట్ర స్థాయిలో నీతిపద్యాల పోటీలను నిర్వహించారు. 80మంది విద్యార్థులు వంద నుంచి 200వరకూ పద్యాలను అవలీలగా చెప్పారు. వీరికి ప్రశంసాపత్రాలు, గ్రంథాలు, జ్ఞాపికలను నిర్వాహకులు బహుమతులుగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పద్యాలను కంఠస్థం చేయడంతో నైతిక విలువలతో పాటు ధారణశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వారికి రూ.500 నగదు బహుమతులను సమితి కార్యదర్శి పుష్ప అందజేశారు. చంద్రశేఖరయ్య, కళావతి, శ్రీరామచంద్రమూర్తి, శివశంకర్‌రెడ్డి, సుదర్శనాచారి, ముద్దుక్రిష్ణ, జయలక్ష్మి, సాధన తదితరులు పాల్గొన్నారు.

సంస్థ బలోపేతానికి సభ్యత్వ నమోదు

పుంగనూరు: పట్టణంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థను బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదుకు పూనుకున్నట్టు ఆ సంస్థ కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం సంస్థ ప్రతినిధులు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ నందీశ్వరయ్య తదితర సభ్యులతో సమావేశం నిర్వహించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం పట్టణంలో చనిపోయిన వారికి అంతిమయాత్రలు నిర్వహించేందుకు శాంతిరథం, అలాగే 4 ఏసీ ఫ్రీజర్లు అందుబాటులో ఉంచామన్నారు. వీటిని ప్రజలకు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు చెంగారెడ్డి, కృష్ణప్ప, జగన్, గంగులమ్మ, వెంకటేష్, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.